సాక్షి ప్రకాశం
మంగళవారం, 29, ఏప్రిల్, 2025



సర్టిఫికేట్..డూప్లికేట్
సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం నుంచి అడ్డగోలుగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు.
- 8లో..



ఫోర్జరీ సంతకంతో బ్యాంక్ లోన్
జిమ్ పేరుతో అద్దెకు తీసుకున్న వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంక్‌లోన్ తీసుకున్నారని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 41 /26
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

టీడీపీ మెడకు... వీరముడి



- టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో కీలక అనుమానితులంతా టీడీపీ వారేనని ప్రచారం
- ఆధిపత్య పోరే హత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారణ
- హవాలా వ్యాపారి, బియ్యం డాన్‌లకూ టీడీపీతో లింకులు
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న చిత్రాలు
- వీళ్లతో సన్నిహితంగా మెలిగిన టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు
- ఈ దారుణానికి ఒడిగట్టిన వారు భూమి మీద ఉండటానికి వీల్లేదంటూ సీఎం చంద్రబాబు ప్రకటన
- హతుడు, హంతకులు టీడీపీకి చెందిన వారే కావడంతో తలలు పట్టుకుంటున్న పోలీసులు



హత్యకు గురైన వీరయ్య చౌదరి మృతదేహం



వీరయ్య చౌదరి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, తెలుగు దేశం పార్టీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా అదే పార్టీకి చెందిన నేతలు, సానుభూతిపరుల పేర్లు వినిపిస్తుండటం అధికార టీడీపీని కలవర పెడుతోంది. హత్యలో పాల్గొన్నది, మొదలు వ్యూహరచన చేసింది అందరూ ఆ పార్టీ వారేనని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇది తమ పార్టీకి ఎక్కడ చెడ్డపేరు తెస్తుందోనన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో నెలకొంది. హత్యకు గురైన వీరయ్య చౌదరి, పోలీసుల అదుపులో ఉన్న ప్రధాన అనుమానితుడికి తెలుగుదేశం పార్టీ అధినాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ఈ నెల 22వ తేదీ రాత్రి 7.30 గంటలకు నగరంలోని ఎస్పీ కార్యాలయానికి, తాలూకా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనున్న భవనంలో వీరయ్య చౌదరి దారుణ హత్యకు గురయ్యాడు. ముసుగులు ధరించిన నలుగురు యువకులు కేవలం మూడు నిముషాల్లోనే ఆయన శరీరంలోకి 53 కత్తి పోట్లు పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ హత్య రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. హత్య జరిగిన రాత్రే హోం మంత్రి అనిత ఒంగోలు చేరుకున్నారు. మరుసటి రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా అమ్మనబ్రోలు చేరుకుని వీరయ్య చౌదరికి నివాళులర్పించారు. ఇంత దారుణానికి పాల్పడిన హంతకులు భూమి మీద ఉండడానికి అనర్హులని ప్రకటించారు. నిందితులు ఎంతటి వారైనా వదిలి పెట్టేదిలేదని హెచ్చరించారు. దీంతో పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. ఈక్రమంలో గత శుక్రవారం చీమకుర్తి బైపాస్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఒక దాబా సమీపంలో హంతకులు వినియోగించిన స్కూటీ లభించింది. దీంతో ఈ కేసులో పోలీసులకు కీలక ఆధారం లభించినట్లయింది. కేసు కీలక మలుపు తిరిగింది. స్కూటీ ఆధారంగా చేసిన విచారణలో వీరయ్య చౌదరి హత్య కేసులో అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ యువనేత ప్రధాన నిందితుడిగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్కూటీ స్వాధీనంతో లభించిన ఆధారాలతో నగరానికి చెందిన కొప్పోలు వాసి ప్రధాన పాత్రధారిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అలాగే రెండో వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకోవడంతో హత్యలో పాల్గొన్న మిగిలిన ముగ్గురూ జిల్లా వాసులుగానే గుర్తించారు. వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

జిల్లా టీడీపీ నేతల్లో కలకలం...

వీరయ్య హత్య కేసులో ప్రధాన అనుమానితుడిగా పోలీసులు అదుపులో ఉన్న టీడీపీ యువనేతకు ఆ పార్టీలోని ముఖ్య నాయకులందరితోనూ సన్నిహిత సంబంధాలున్నాయని తెలుస్తోంది. స్థానిక నాయకులతో పాటు జిల్లాకు చెందిన కీలక ఎమ్మెల్యేలు, మంత్రులతో సదరు వ్యక్తి అత్యంత సన్నిహితుడిగా మెలిగేవాడని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడా నాయకులు తేలుకుట్టిన దొంగల్లా మౌనం పాటిస్తున్నారు. ఏం మాట్లాడితే ఏమవుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఈ కేసు ఎటుపోయి ఎటు వస్తుందో, చివరికి ఎవరి తలకు చుట్టుకుంటుందోనని కలత చెందుతున్నారు. అలాగే ప్రచారంలో ఉన్న హవాలా వ్యాపారికి, రేషన్ బియ్యం డాన్‌కు సైతం టీడీపీ నేతలతో మంచి సంబంధాలున్నాయని ప్రచారం.అలాగే హత్యలో పాల్గొన్న ప్రధాన అనుమానితుడికి సైతం ఆ పార్టీతో లింకులున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇది కూడా తెలుగుదేశం పార్టీ నాయకులను ఇరుకున పెడుతోంది.

వీరయ్య కేసును ఏం చేస్తారు...

వీరయ్య చౌదరి అంత్యక్రియలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిందితులు భూమి మీద ఉండేందుకు అర్హులు కారని చెప్పడం, నిందితులు ఎంతటి వారైనా ఒదిలిపెట్టేది లేదనడంతో ఈ కేసు గురించి ప్రజలు అనేక రకాలుగా చర్చించుకుంటున్నారు. హత్యకు గురైన వీరయ్య చౌదరి టీడీపీకి చెందిన నాయకుడు కావడం, హత్యలో ప్రధాన అనుమానితుడిగా పోలీస్ కస్టడీలో ఉన్న యువనేత కూడా టీడీపీకి చెందిన నాయకుడే కావడంతో ఇప్పుడీ కేసును ఏం చేస్తారోనన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజంగా సీఎం చంద్రబాబు చెప్పినట్లు నిందితులను కఠినంగా శిక్షిస్తారా? లేక క్రమంగా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తారా? అనే అంశాలు జోరుగా ప్రచారం సాగుతున్నాయి. ఈ కేసులో అనుమానితులుగా భావిస్తున్న మిగతా వారు కూడా అధికార పార్టీకి చెందిన సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అధికార పార్టీ స్థానిక నాయకులతో, రాష్ట్రంలోని కీలక నాయకులతో రాసుకుని పూసుకుని తిరిగిన వారు కావడంతో ఈ కేసు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందోనన్న చర్చ జరుగుతోంది.

డైలమాలో పోలీసులు...

వీరయ్య కేసులో పోలీసుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. హత్య జరిగి దాదాపు ఎనిమిది రోజులు కావస్తున్నా ఇంతవరకూ ఒక కొలిక్కి రాలేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి హతుడు వీరయ్య చౌదరి చుట్టూ అనేక వివాదాలు ఉన్నాయి. మద్యం సిండికేట్, బియ్యం మాఫియా, భూ, ఆర్థిక వివాదాలున్నాయి. అయినా ఆయన టీడీపీ నాయకుడు కావడం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో సంబంధాలు కలిగి ఉండడంతో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. విచారణ ముందుకు సాగుతున్న కొద్దీ ఈ కేసు పోలీసులకు పలు సవాళ్లు విసురుతోంది. విచారణలో అనుమానితులంతా టీడీపీ నాయకులే కావడంతో పాటు వారికి జిల్లా టీడీపీ నాయకులతో, మంత్రులతో పాటుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నట్లు సమాచారం. స్కూటీ లభించిన రోజు టీడీపీ మీడియా చానళ్లలో అధికార పార్టీ నేతల ప్రమేయాన్ని పేర్లతో సహా ప్రసారం చేశారు. అయితే, ఆ తర్వాత ఏమైందో తెలియదు రోజుకో పేరు తెరపైకి వస్తున్నాయి. ఈ కేసు మరకలను ఇతర పార్టీలకు అంటగట్టేలా ఆ పత్రికల్లో కథనాలు వస్తుండటంతో కేసు పక్కదోవ పడుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పెద్దల వద్ద నుంచి కూడా పోలీసులకు ఒత్తిడి వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందుకే ఇలా ఇతర పార్టీలకు చెందిన వారి పేర్లను ప్రచారంలోకి తెస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

పదిలో ఫెయిలైన వారికి ప్రత్యేక కార్యాచరణ

ఒంగోలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులకు ఈ నెల 28 నుంచి మే 18వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం తరగతులు నిర్వహించాలని డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించినట్లు తెలిపారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుని ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. ఉపవిద్యాశాఖాధికారులు, ప్రత్యేక తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన సూచనలు తెలిపాలన్నారు. ఉదయం 8 నుంచి 9.15 గంటల వరకు సోషల్/భాషలు, ఉదయం గం.9.15 నుంచి గం.10.15 వరకు సైన్స్ (పీఎస్, బయోలాజికల్ సైన్స్), ఉదయం గం.10.15 నుంచి గం.10.30 గంటల వరకు విరామం, ఉదయం గం.10.30 నుంచి గం.12 వరకు గణితం.. ఈ ప్రకారం ఉత్తీర్ణులు కాని విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రధానోపాధ్యాయులు తరగతుల షెడ్యూల్‌ను మార్పు చేసుకోవాలని తెలిపారు.

ఉగ్రవాదుల దాడి.. భారత లౌకికవాదంపై దాడే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జాతీయ కార్యదర్శి ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: కశ్మీర్‌లోని పహెల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడి ఏకంగా దేశ లౌకిక కత్వంపై చేసిన దాడేనని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి ఎస్.లెనిన్ బాబు విమర్శించారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో సోమవారం నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పహెల్గామ్ దాడిని పిరికిపందల దాడిగా అభివర్ణించారు. కేవలం హిందువులను మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడులకు పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల ముందే అనేక మంది హతమయ్యారని, వారి కుటుంబ సభ్యుల ఆవేదన చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. మూడంచెల భద్రత కలిగిన జమ్మూ కశ్మీర్లోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారో సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు యువతరం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్ర, జీ.సంతోష్ కుమార్, కత్తి రవి, నాగ రాముడు, ప్రభాకర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని చోట సిమెంట్ రోడ్డా..!

ఎంపీ అనుమతిచ్చారు..అధికారులు వేశారు..



హజరత్‌గూడెం పంచాయతీ పరిధిలో గృహాలు లేని చోట వేసిన సిమెంటు రోడ్డు

నివాస గృహాలు ఉన్న చోట వదిలేసి ఇళ్లు లేని ప్రాంతాల్లో రోడ్లు వేసి ఔరా అనిపిస్తున్నారు కూటమి పాలకులు..మూడు నెలల కిందట కంభం మండలానికి రూ.60 లక్షల ఎంపీ నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా హజరత్ గూడెం పంచాయతీ పరిధికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. హజరత్ గూడెం పంచాయతీ కంభం, కందులాపురం పంచాయతీల్లో కలసి పోయి ఉంటుంది. హైవే సమీపంలో, వాసవీ స్కూల్, గౌతమి స్కూల్ వెనుక వైపున, బస్టాండుకు హైవేకి మధ్యలో ఉండే గృహాల ద్వారానే హజరత్ గూడెం పంచాయతీకి అధికంగా పన్నులు వసూలయ్యేది. ఆ ప్రాంతాన్ని వదిలేసి ప్రస్తుతం హైవేపై ఉన్న ఫంక్షన్ హాలు పక్క వీధిలో రూ.10 లక్షలు వెచ్చించి 158 మీటర్ల సిమెంటు రోడ్డు వేశారు. అయితే ఆ ప్రాంతంలో ఒక్క ఇల్లు కూడా లేకపోవడం గమనార్హం. ఇదేంటని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తే..ఎంపీ కార్యాలయం నుంచే ఎక్కడ రోడ్డు వేయాలో పేరుతో సహా మంజూరై వచ్చిందని సమాధానమిస్తున్నారు. దీంతో వారు నివ్వెరపోతున్నారు. చాలా వీధుల్లో ఇళ్లు ఉన్నా సిమెంటు రోడ్లు వేయలేదని.. అసలు ఇళ్లు లేని చోట సిమెంటు రోడ్డు వేయడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు ఉపయోగపడకపోతే ఎలా అంటూ వాపోతున్నారు.

- కంభం

కొప్పోలు నిందితుడి చుట్టే విచారణ..

- ప్రధాన నిందితుని బంధువు ఇచ్చిన సమాచారంతో ఇతర జిల్లాలకు దర్యాప్తు బృందాలు
- నిందితుడి జాడ దొరక్కపోవడంతో తలలు పట్టుకుంటున్న పోలీసులు
- పొరుగు జిల్లాకు చెందిన ఎంపీటీసీని విచారిస్తున్న పోలీసులు
- ఇప్పటికీ 100 మందికిపైగా విచారణ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన పాత్రధారుడిగా చెప్పుకుంటున్న కొప్పోలు వాసి చుట్టే విచారణ కొనసాగుతోంది. ఈ నెల 22వ తేదీన వీరయ్య చౌదరి హత్య జరిగి వారం రోజులు దాటుతోంది. అయినా నిందితులకు సంబంధించిన పూర్తి సమాచారం లభించలేదని పోలీసులు చెబుతుండడం గమనార్హం. హత్య తరువాత తొలి నాలుగు రోజుల పాటు విచారణ ఒక్క అడుగైనా ముందుకు కదల్లేదు. గత శుక్రవారం చీమకుర్తి జాతీయ రహదారి పక్కన రక్తపు మరకలతో ఉన్న స్కూటీ దొరికిన తరువాత విచారణ ఊపందుకోవడం తెలిసిందే. కీలక నిందితుడిగా అనుమానిస్తున్న అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువనాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ మరుసటి రోజు రెండో వాహనం కూడా దొరికింది. ఈ వాహనం కొప్పోలు వాసి బావమరిది పేరు మీద ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దాంతో అతడిని తీసుకొచ్చిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. తనకు ఏమీ తెలియదని, నగరంలోని ఒక లాడ్జిలో ఉన్న కొంత మందికి ప్రతిరోజు భోజనాలు పంపేవాడినని చెప్పినట్టు తెలిసింది. అయితే కావలి నుంచి వచ్చి ఒంగోలులో నివాసం ఉంటున్న మరో ఇద్దరిని కూడా పోలీసులు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. వీరిలో ఒక వ్యక్తి భార్య బ్యాంకు ఉద్యోగి అని చెప్పుకుంటున్నారు. అలాగే బాపట్ల జిల్లాకు చెందిన ఒక ఎంపీటీసీని కూడా అదుపులోకి తీసుకొచ్చి తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపుగా వంద మందిని తీసుకొచ్చి విచారణ చేసిన పోలీసులు ఇప్పుడు కూడా అదే పనిలో ఉన్నట్లు చెబుతున్నారు. మరికొందరిని తీసుకొచ్చి విచారించే పనిలో ఉన్నారు. ఇప్పటికే అమ్మనబ్రోలుకు చెందిన ప్రధాన అనుమానితుడిగా నిర్ధారించిన పోలీసులు కొప్పోలు వ్యక్తిని ప్రధాన పాత్రధారుడిగా చెబుతున్నారు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న అతడు దొరికితే వీరయ్య కేసు పూర్తిగా ఒక కొలిక్కి వచ్చినట్లేనని భావిస్తున్నారు. హత్య జరిగిన తరువాత వైజాగ్ పారి పోయాడని నిర్ధారించుకున్న పోలీసులు అతడి కోసం వారం రోజులుగా అక్కడ తిష్టవేసి గాలిస్తున్నారని సమాచారం.

నెల రోజుల క్రితం చీమకుర్తిలో మద్యం ఘర్షణ:

వీరయ్య చౌదరికి మద్యం వ్యాపారాల వ్యవహారంలో అనేక వివాదాలు ఉన్నట్లు మొదట్నుంచి ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే నెల రోజుల క్రితం చీమకుర్తిలో మద్యం వ్యాపారం విషయంలో గొడవ జరిగినట్లు సమాచారం. అలాగే మంగమూరులో కూడా మద్యం వ్యాపారం విషయంలో తగాదాలు జరిగినట్లు చెప్పుకుంటున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో పాటు, వీరయ్య హత్య కేసు విచారణలో కీలకంగా ఉన్న సీఐలు కేసు కొలిక్కి తెచ్చే పనిలో బిజీగా ఉన్నారు.

నిందితులు ఎవరైనా వదలం...

వీరయ్య చౌదరి హత్యకేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులు ఎంతటి వారైనా, ఏ పార్టీ వారైనా వదిలిపెట్టం. పార్టీలకతీతంగా అనుమానితులందరినీ అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నాం. ప్రమేయం లేనివారిని విచారించి వదిలేస్తాం.

- ఎస్పీ ఏఆర్ దామోదర్

జీతాలివ్వండి మహాప్రభో!



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

- నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- సబ్‌కలెక్టర్ కార్యాలయం, జీజీహెచ్ ఎదుట వర్కర్స్ ధర్నా

మార్కాపురం: నాలుగు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్ ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చెల్లించాలని సీఐటీయూ కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్‌కు మద్దతుగా సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం, జీజీహెచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్‌కు పెండింగులో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా నెల నెలా చెల్లించకుంటే వారెలా బతకాలని ప్రశ్నించారు. వేతనాలు చెల్లించకుండా కార్మికులచేత పనిచేయిస్తున్న విజయవాడకు చెందిన ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్ పేరుతో డబ్బులు కట్‌చేస్తూ వారి పీఎఫ్ ఖాతాల్లో జమ చేయడం లేదని అన్నారు. జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాల పోషించుకోలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పెండింగులో ఉన్న జీతాలను చెల్లించి పీఎఫ్ సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బరాయుడు, శివారెడ్డి, సుబ్రహ్మణ్యం, రూబెన్, రాజు, స్వప్న, కొండమ్మ, మల్లిఖార్జున, నూర్జహాన్, మీరాంబి తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెంపొందేలా విజన్ ప్లాన్

- నియోజకవర్గ స్థాయి పరిస్థితులపై అధ్యయనం
- ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌పై వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



విజన్ డాక్యుమెంట్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందేలా నియోజకవర్గ స్థాయి విజన్ ప్లాన్‌ను రూపొందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచించారు. ఒంగోలులోని ఎన్జీఓ హోంలో స్వర్ణాంధ్ర- 2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్ రూపకల్పన, ముఖ్య నిర్దేశిత లక్ష్యాలపై ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు సంబంధించి సోమవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడారు. జిల్లా విజన్ ప్లాన్‌ను రూపొందించారన్నారు. నియోజకవర్గ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా సృజనాత్మకంగా ఆలోచించి, ప్రస్తుతం నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వటానికి వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక నియోజకవర్గంలో రానున్న సంవత్సరాల్లో ఏ సెక్టార్‌లో అభివృద్ధి, వృద్ధి రేటు ఎలా ఉంటుంది, వాటిని ఎలా అభివృద్ధి చేయాలన్న అంశాలపై నియోజకవర్గాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా సృజనాత్మకంగా ఆలోచించి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సీపీఓలు వెంకటేశ్వరరావు, రఘురామయ్య, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సలహాదారు సీతాపతి, రెండు జిల్లాలకు చెందిన నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, సీపీఏపీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మీ కోసంలో 268 వినతులు

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(మీ కోసం) 268 వినతులు వచ్చాయి. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరై నేరుగా అర్జీదారులతో మాట్లాడారు. వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథి, మాధురి, విజయజ్యోతిలతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సుబ్రహ్మణ్యం

ఒంగోలు టౌన్: ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి కొత్త సూపరింటెండెంట్ గా డాక్టర్ సుబ్రహ్మణ్యంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం మెడికల్ కళాశాలలో ఎండోక్రైనాలజీ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పదోన్నతి పై ఆయనను ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్ గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ జమునను కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గా బదిలీ చేశారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం, వికాసం

- చిన్నారులకు గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేయాలి
- డీఈఓ కిరణ్ కుమార్



వేసవి శిక్షణ తరగతుల ప్రారంభ సభలో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్ కుమార్

ఒంగోలు టౌన్: బాల్యం నుంచే పిల్లలకు గ్రంథాయాలకు వెళ్లేలా అలవాటు చేయాలని డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ సూచించారు. సోమవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ఆయన ప్రారంభించారు. డీఈఓ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా చిన్నారులు ప్రతి రోజూ గ్రంథాయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పప్పెట్ మేకింగ్, డ్యాన్స్ నేర్చుకోవడం ద్వారా మానసిక వికాసం కలుగుతుందన్నారు. 40 రోజుల పాటు సాగే వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేసవిలో చిన్నారులను శిక్షణ తరగతులకు పంపించాలని తలిదండ్రులకు సూచించారు. మంచి అలవాట్లే పిల్లల ఉన్నతికి కారణమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకులతోపాటు గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్.. డూప్లికేట్.!

- నంతనూతలపాడులో అంగట్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు..!
- తహసీల్దార్ కార్యాలయం నుంచి అడ్డగోలుగా సర్టిఫికెట్ల మంజూరు
- మృతుడి కుటుంబానికి ఏ సంబంధం లేని మహిళకు సర్టిఫికెట్ జారీ చేసిన తహసీల్దార్
- ఓ రిజిస్ట్రేషన్ కోసం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి మంజూరు చేసినట్లు ఆరోపణలు
- రిజిస్ట్రేషన్ సమయంలో బట్టబయలైన వ్యవహారం
- విషయం బహిర్గతం కావడంతో సర్టిఫికెట్‌ను రద్దు చేసిన వైనం
- మద్దిపాడు తహసీల్దార్ ఏసీబీకి దొరికిన విషయం మరవకముందే వెలుగులోకి మరో అంశం


నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్


ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రద్దు చేసినట్లుగా మీ సేవ వెబ్‌సైట్లో ప్రస్తుతం కనిపిస్తున్న స్టేటస్

సంతనూతలపాడు:

రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలు రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నాయి. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్నతాధికారి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డదిడ్డంగా పనులు చేస్తున్నారు. లంచాలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఏ పనైనా చేయడం, లంచాలు ఇవ్వకుంటే సక్రమంగా చేయాల్సిన పనులు కూడా నిలిపివేయడం వంటివి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో అనేక సేవలు నిలిచిపోవడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలే లక్ష్యంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అడ్డగోలుగా దోచుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఆయా సర్టిఫికెట్లను అడ్డం పెట్టుకుని మరికొన్ని అక్రమాలకు పాల్పడే వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల మద్దిపాడు తహసీల్దార్ సృజన్‌కుమార్, దొడ్డవరం వీఆర్వో కలిసి ఓ డెత్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు రూ.90 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం, తాజాగా సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి గతేడాది మృతుడి కుటుంబంతో సంబంధం లేని మహిళకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేయడం, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు గుప్పుమనడంతో అనంతరం దాన్ని రద్దు చేయడం వంటివి జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ...

సంతనూతలపాడు మండలానికి ఏ సంబంధం లేని కంభం మండలానికి చెందిన మన్నం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చనిపోగా, అతని కుటుంబానికి ఏ సంబంధం లేని సున్నం వెంకటలక్ష్మమ్మ అనే మహిళను కుమార్తెగా చేరుస్తూ సంతనూతలపాడు తహసీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. అతని భార్య మన్నం వెంకాయమ్మ పేరును కూడా కుటుంబ సభ్యుల జాబితాలో నమోదు చేసి ఆమె చనిపోయినట్లుగా పేర్కొన్నారు. అయితే, మృతులు మన్నం వెంకటేశ్వర్లు, మన్నం వెంకాయమ్మతో సున్నం వెంకటలక్ష్మమ్మకు ఏ సంబంధం లేదు. కానీ, మృతులకు వెంకటలక్ష్మమ్మ కుమార్తె అని ధ్రువీకరిస్తూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఈ విషయం ఇటీవల సంతనూతలపాడు మండలంతో పాటు నియోజకవర్గంలోనే చర్చనీయాంశమైంది. మన్నం వెంకటేశ్వర్లుకు ఒంగోలు సమీపంలో విలువైన డీకే పట్టా స్థలం ఉండటంతో దాన్ని కాజేసేందుకు కొందరు వ్యక్తులు అక్రమంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం సున్నం వెంకటలక్ష్మమ్మ అనే మహిళ పేరుమీద దరఖాస్తు చేశారు. వాస్తవానికి మృతుడు మన్నం వెంకటేశ్వర్లు కుటుంబంతో సున్నం వెంకటలక్ష్మమ్మకు ఎలాంటి సంబంధం లేదు. కానీ, సున్నం వెంకటలక్ష్మమ్మ ద్వారా మన్నం వెంకటేశ్వర్లుకు చెందిన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం గతేడాది సెప్టెంబర్ 2వ తేదీ దరఖాస్తు చేశారు. సంతనూతలపాడు తహసీల్దార్ అదే నెల 19వ తేదీ సర్టిఫికెట్ మంజూరు చేశారు. సరైన ఆధారాలు లేకుండా, విచారణ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడం వెనుక తహసీల్దార్ స్థాయిలో లక్షల రూపాయల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అక్రమార్కులు ప్రయత్నించిన సమయంలో అది తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అని తేలడంతో అసలు విషయం బయటకొచ్చింది. దీంతో ఎక్కడ తమ అవినీతి బయటపడుతుందోనని ఆ సర్టిఫికెట్‌ను తహసీల్దార్ రద్దు చేసినట్లు తెలుస్తోంది. రిమార్క్స్ ఏమీ పెట్టకుండానే సర్టిఫికెట్‌ను రివోక్ చేయడం చర్చకు దారితీస్తోంది. అయితే, అప్పటికే ఆ సర్టిఫికెట్‌ను అడ్డం పెట్టుకుని అక్రమార్కులు ఎక్కడెక్కడ ఏమేం పనులు చేయించుకున్నారు, మృతుడికి చెందిన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారా..లేదా..? అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. తహసీల్దార్ కార్యాలయ అధికారులు తమ జేబులు నింపుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా జారీ చేస్తున్న సర్టిఫికెట్లను అడ్డం పెట్టుకుని విలువైన ఆస్తులను అక్రమార్కులు కాజేస్తుండటంతో రోజురోజుకూ జిల్లాలో వీరి బాధితులు పెరిగిపోతున్నారు. ఇలాంటివి జరగకుండా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందిపై కలెక్టర్, జేసీలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నన్ను తప్పుదోవ పట్టించి సర్టిఫికెట్ తీసుకున్నారు :

సున్నం వెంకటలక్ష్మమ్మకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. దరఖాస్తుదారులు ఆధారాలుగా నకిలీ సర్టిఫికెట్లు చూపించి నన్ను తప్పుదోవ పట్టించారు. అందువలనే ఆమెకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేశాం. అనంతరం అసలు విషయం తెలిసిన వెంటనే కలెక్టర్‌కు వివరణ రాసి సదరు సర్టిఫికెట్‌ను రద్దు చేశాం.

వేమూరి ఆదిలక్ష్మి, తహసీల్దార్, సంతనూతలపాడు

ఫోర్జరీ సంతకంతో బ్యాంక్ లోన్

- ఎస్పీ దామోదర్‌కు బాధితుల ఫిర్యాదు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 69 అర్జీలు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 69 ఫిర్యాదులు అందాయి. బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో ఒక కమర్షియల్ భవనాన్ని జిమ్ పేరుతో అద్దెకు తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకు నుంచి రుణం తీసుకుని మోసం చేశారని ఒంగోలుకు చెందిన బాధితుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రుణాన్ని చెల్లించకపోవడంతో బ్యాంకు నుంచి నోటీసులు అందడంతో అసలు విషయం బయటపడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో రుణం తీసుకోవడమేంటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు వాపోయారు.


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

➤ కుటుంబ అవసరాల కోసం ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి తనకు తెలిసిన ప్రభుత్వ ఉద్యోగిని ష్యూరిటీగా పెట్టి రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. రుణం తిరిగి చెల్లించే సమయంలో ఇటీవల మూసేసిన సిండికేట్ బ్యాంకు చెక్కు ఇచ్చి మోసం చేశాడని నగరానికి చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు.

టీడీపీకి ఓట్లు వేయలేదని కొడుతున్నారు

అర్ధవీడు: టీడీపీకి కాకుండా వైఎస్సార్ సీపీకి ఓటు వేశారంటూ నాలుగు నెలుగా తరచూ గొడవపడుతూ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని అర్ధవీడు మండలంలోని చింతమెల్లెలపాడు గ్రామానికి చెందిన వేశపోగు రవి సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గతంలో అర్ధవీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈనెల 25న టీడీపీ వర్గీయులు కువ్వారపు నాగేంద్ర, మౌనిక, ఆనంద్, సలోమి, వేశపోగు నాగమ్మ, విజయ్, ముసలికాశయ్య మూకుమ్మడిగా తమ ఇళ్లపైకి వచ్చి వేశపోగు కళావతి, జ్వాలా, పెద్ద కాశయ్యపై గొడ్డలితో దాడి చేయగా ఒక్కొక్కరి తలపై 8 నుంచి 10 కుట్లు పడ్డాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్ధవీడు పోలీసులు తమ వద్ద స్టేట్‌మెంట్ తీసుకుని కంభం ప్రభుత్వ వైద్యశాల నుంచి బలవంతంగా డిశ్చార్జి చేయించారని చెప్పారు. తమకు రక్షణ కల్పించాలని, పలుమార్లు దాడి చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఎస్పీ ఎదుట వాపోయారు.

డిప్యూటీ స్పీకర్ క్షమాపణలు చెప్పాలి

ఒంగోలు టౌన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును ఉద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. రఘురామకృష్ణరాజు చేత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు క్షమాపణ చెప్పిస్తారో లేక స్వయంగా బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలన్నారు. డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎంతోమంది రాజకీయ నాయకులు కాలగర్భంలో కలిసి పోయారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ.. రఘురామకృష్ణరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు గ్రామంలో 30 ఏళ్లకు పైగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై సీపీఎం కార్యదర్శి సందర్శించినందుకు డిప్యూటీ స్పీకర్ సంయమనం కోల్పోయి మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. ఒక జాతీయ పార్టీ నేతను పట్టుకొని బతికి పోయావు పో అంటూ బెదిరింపులకు దిగిన డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై కూటమి పాలకులు స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న నాయకుడు అప్రజాస్వామికంగా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో త్యాగం చేస్తున్న జాతీయ పార్టీ నాయకుల పట్ల డిప్యూటీ స్పీకర్ అనుచితంగా మాట్లాడడం క్షమార్హం కాదన్నారు. రాష్ట్రంలో బుల్డోజర్ సంస్కృతికి స్వస్తి పలకాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ..రఘురామకృష్ణరాజు తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసనలో పి.కల్పన, కంకణాల రమాదేవి, జీ.ఆదిలక్ష్మి, కాలం సుబ్బారావు, జాలా అంజయ్య, సీహెచ్ వినోద్, టి.మహేష్, తంబి శ్రీనివాసరావు, శ్రీరాం శ్రీనివాసరావు, తోట తిరుపతిరావు, భక్తసింగ్ రాజు, బీవీ రావు, కొత్తకోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలపై నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష నాయకులు

జిల్లా మాల ఉద్యోగుల సంఘ కమిటీ ఎన్నిక

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా మాల ఉద్యోగుల సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి ఎన్నికలు నిర్వహించారు. సంఘ నూతన జిల్లా అధ్యక్షుడిగా గోపతోటి శ్యాంసన్, గౌరవ అధ్యక్షుడిగా పీకా మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మద్దులూరి రమణయ్య, ఉపాధ్యక్షుడిగా చిడితోటి నరేంద్రకుమార్, పీ సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీ థామస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేంద్ర, కోశాధికారిగా టీ శ్రీకాంత్, సహాయ కోశాధికారిగా కే జాలయ్య, బీ నాగేంద్రవదన్, ఎస్ ఆనందరావు, మహిళా జిల్లా అధ్యక్షురాలుగా కే సుచరిత, ఎస్ యానాది, జే ఆనందరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కే రాజేంద్ర, డీ అంజయ్య, పీ వెంకట నారాయణ, లీగల్ అడ్వైజర్‌గా కే బాబురావును ఎన్నుకున్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న మాల ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

- సెలవుల్లో ఊర్లు, విహార యాత్రలకు వెళ్తున్నారా..?
- నిర్లక్ష్యంగా వెళ్తే ఇక మీ ఇళ్లు గుల్లే..
- తాళాలు వేసిన ఇళ్లే దొంగల టార్గెట్
- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌పై ప్రజల్లో అవగాహన లేమి
- ఇటీవల కాలంలో జిల్లాలో పెరిగిన చోరీలు

చోర్.. చోర్..!



కంభం:

పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. అన్ని పాఠశాలలకు ఈ నెల 23వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో కుటుంబంతో కలిసి సరదాగా విహారయాత్రలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లేందుకు కొందరు.. పట్టణాల నుంచి స్వగ్రామాలకు వెళ్లే హడావుడిలో మరికొందరు ఉన్నారు. ఇంటికి తాళం వేస్తున్నాం కదా ఏమవుతుందిలే అని అనుకుని ఏమరపాటుగా వ్యవహరిస్తే కష్టపడి సంపాదించినదంతా దొంగల వశమవుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా వేసవి కాలంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల కాలంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన చోరీల్లో నగలు, నగదు అపహరణకు గురయ్యాయి. కొన్ని కేసులను పోలీసులు ఛేదించి బాధితుల సొమ్ము తిరిగి అప్పగించగా మరి కొన్ని కేసుల్లో నిందితుల కోసం గాలిస్తున్నారు.


టంగుటూరులో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్(ఫైల్)

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కరువు

తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు పట్టపగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు కొల్లగొట్టేస్తున్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ జిల్లా కేంద్రాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో పెద్దగా వినియోగంలో లేనట్లు తెలుస్తోంది. ఈ విధానం అమల్లోకి వస్తే దొంగతనాలు సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి వివరాలు పోలీసులకు చేరుతాయి. ఊర్లు, విహారయాత్రలు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఇంటికి దూరంగా ఉంటారో యాప్‌లో నమోదు చేస్తే పోలీసులు ఇంటిని పరిశీలించి నిఘా కెమెరాలు అమరుస్తారు. ఇంట్లోకి కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే నేరుగా పోలీసు కంట్రోల్ రూములో అలారం మోగుతుంది. తద్వారా స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు. ఇంటి యజమానులు తిరిగొచ్చే వరకు ఎలాంటి ధోకా ఉండదు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి



ఊర్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో గస్తీ పెడతాం. ఎల్‌హెచ్‌ఎంఎస్‌కు సంబంధించి ఒక కెమెరా అందుబాటులో ఉంది. అవసరమైన చోట ఆ కిట్‌ను వినియోగించుకోవచ్చు. విలువైన వస్తువులు వారితో పాటు తీసుకెళ్లాలి లేదా లాకర్లలో భద్రపరుచుకోవాలి.

– నరసింహారావు, ఎస్సై, కంభం

దొంగతనాలతో బెంబేలు

☛ గతేడాది నవంబర్ 29న కంభం మండలంలోని సూరేపల్లిలో గాలేటి వెంకట్రావు గృహంలో నాలుగున్నర తులాల బంగారం, రూ.35 వేలు నగదు అపహరించారు. ఈ కేసులో డిసెంబరు 14న దొంగలను అదుపులోకి తీసుకున్న పోలీసులు పోయిన సొత్తును రికవరి చేసి బాధితులకు అందజేశారు.

☛ గతేడాది డిసెంబర్ 21న కంభంలోని అంకాళమ్మ తిప్పవీధిలో గంజి చిన్న వెంకటేశ్వర్లు గృహంలో రూ.లక్షన్నర నగదు కాజేశారు.

☛ ఈ ఏడాది జనవరి 7వ తేదీన పామూరు మండలం గోపాలపురంలో రాము అనే వ్యక్తి నివాసం ఉంటున్నారు. ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా స్వగ్రామం వెళ్లగా దొంగలు చొరబడి రూ.లక్ష నగదు, వెండి, బంగారు ఆభరణాలు కాజేశారు.

☛ జనవరి 26వ తేదీన మూలగుంటపాడు పంచాయతీ రాజులకాలనీలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి జంపన ఆంజనేయరాజు ఇంటిని దొంగలు కొల్లగొట్టారు. కుమార్తె, అల్లుడితో కలిసి ఆంజనేయరాజు దంపతులు చెన్నై వెళ్లగా.. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి 5 సవర్ల బంగారం, రూ.30 వేల నగదు అపహరించారు. అదే రోజు గిద్దలూరు పట్టణంలోని పాండురంగ కాలనీలో విశ్రాంత సైనికుడి నివాసంలో దొంగలు పడి ఎల్‌ఈడీ టీవీ, రూ.5 వేల నగదు చోరీ చేశారు.

☛ జనవరి 26 తేదీ అర్ధరాత్రి తాళాలు వేసిన మూడు ఇళ్లను దొంగలు లూటీ చేశారు. మొత్తం 36 సవర్ల బంగారు ఆభరణాలు, ఆరు కేజీల వెండి వస్తువులు, రూ.85 వేల నగదు అపహరించారు. ఈ మూడు చోరీలు ఒకే రీతిలో జరగడం గమనార్హం.

☛ ఫిబ్రవరి 13వ తేదీన కంభం మండలంలోని దరగా గ్రామంలో నారుబోయిన చిన్నఆవులయ్య మిర్చి కోతకు వెళ్లగా ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ.20 వేల నగదు అపహరించారు.

☛ ఏప్రిల్ 15వ తేదీన కంభం మండలం పోరుమామిళ్లపల్లిలో హైవే వెంట ఉన్న ఓ గృహంలో పట్టపగలే దొంగలు పడి 70 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, రూ.2 లక్షల నగదు అపహరించారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో ఇళ్లు, వ్యాపార దుకాణాలు, మద్యం షాపులను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు తెగబడ్డారు.


ఈనెల 15న పోరుమామిళ్లపల్లిలో పట్టపగలు చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్(ఫైల్)

ఉరేసుకుని కార్మికుడు మృతి

కనిగిరి రూరల్: పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికుడు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి కనిగిరి మండలంలోని వంగపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వంగపాడు సమీపంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో మెగా బేస్ క్యాంప్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పశ్చిమబెంగాల్ రాష్ట్రం నసర్తాపూర్‌కు చెందిన హరిదయ రతన్‌దాస్ (49) పని చేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ కలహాలు, సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బేస్ క్యాంప్‌లోని షెడ్ ఇనుప రాడ్డుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఆ మేరకు బేస్ క్యాంప్ పీఆర్‌ఓ ముంద్రు వినయ్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


ప్రతీకాత్మక చిత్రం

మార్కాపురం డివిజన్ పంచాయతీ అధికారిగా భాస్కర్‌రెడ్డి

మార్కాపురం: మార్కాపురం డివిజన్ పంచాయతీ అధికారిగా ఎంపీ భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన పల్నాడులో పంచాయతీ అధికారిగా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం డివిజన్‌లో నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎల్‌పీఓగా వై.భాగ్యవతి వ్యవహరిస్తున్నారు.